క్లుప్తంగా

జీసీసీ సొసైటీ అధ్యక్షుడిగా రామారావు



సీతంపేట: గిరిజన సహకార సంస్థ సొసైటీ అధ్యక్షుడిగా కూరంగి రామారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా మూటక ఎండయ్య, డైరెక్టర్లుగా వూయక సింహాద్రి, పిరపక శ్రీనివాసరావు, కుండంగి బలరాం, మూటక రత్నాలమ్మ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు. కార్యక్రమంలో మేనేజర్ దాసరి కృష్ణ పాల్గొన్నారు.

చైర్‌పర్సన్‌ను ఎన్నుకోవాలి..

పాలకొండ: నగర పంచాయతీకి సభ్యులు కొత్త చైర్‌పర్సన్‌ను తక్షణమే ఎన్నుకోవాలని సీఐటీయూ జిల్లా నాయకుడు దావాల రమణారావు కోరారు. ప్రస్తుత చైర్‌పర్సన్ రాజీనామా చేసిన నేపథ్యంలో అదే రిజర్వేషన్ నుంచి మరొకరిని సభ్యులు ఎన్నుకోవాలని సూచించారు. పట్టణ సమస్యలను దృష్టిలో పెట్టుకుని ఎన్నిక తక్షణ అవసరమన్నారు. ఇప్పటికే డంపింగ్ యార్డు సమస్య, తాగునీటి ఇబ్బందులు, పారిశుద్ధ్య నిర్వహణ లోపం వంటి సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అధికారులు స్పందించి పట్టణ ప్రజల సమస్యల పరిష్కారం కోసం చొరవ చూపాలని కోరారు.

పొలం పిలుస్తోంది..



సూచనలిస్తున్న వ్యవసాయాధికారి శ్రీదేవి

సీతంపేట: మండ, పెద్దూరు గ్రామాల పరిధిలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రబీ సీజన్‌లో ఏఏ పంటలు పండించుకోవాలి, ఎటువంటి విత్తనాలు వేయాలి తదితర అంశాలను మండల వ్యవసాయాధికారి శ్రీదేవి వివరించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా అధిక దిగుబడులు వస్తాయన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం



మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు తిరుపతిరావు

భామిని: మండలంలో రైతులు ఎదుర్కొంటున్న సాగునీటి సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.తిరుపతిరావు మంగళవారం డిమాండ్ చేశారు. మండల పార్టీ కార్యవర్గ సమావేశంలో మండలంలో ప్రధాన సమస్యలు వివరించారు. వంశధార నదీ తీరంలో ఉన్న భామిని మండలం భూములకు సాగునీరు లేక పంటలు మాడిపోతున్నాయని ఆరోపించారు. మండలంలో విస్తరించిన 26 కిలోమీటర్లు ఏబీ రోడ్డులో తారు రోడ్డు ఆనవాళ్లు లేని దుస్థితికి చేరి గోతుల మయంగా మారిందని, నడవడానికి కూడా పనికి రానట్లుగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆరు వేల ఎకరాల్లో పత్తి పంట పండిస్తున్నా.. గిట్టుబాటు ధర రావడం లేదని, కొనుగోలు కేంద్రం లేదన్నారు. ఆ పార్టీ నాయకులు గొర్లె జగన్నాయకులు, కొప్పర మిన్నారావు, కొండగొర్రి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల రక్షణపై అవగాహన



మాట్లాడుతున్న ఏఎస్ఐ రూన్సీ

పాలకొండ రూరల్:

స్థానిక డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ శ్యాంబాబు అధ్యక్షతన ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం మహిళా రక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎక్కడ స్త్రీలు గౌరవించబడతారో అక్కడ దేవతలు కొలువవుతారని ప్రిన్సిపాల్ శ్యాంబాబు అన్నారు. ఏఎస్ఐ రూన్సీ మాట్లాడుతూ స్త్రీలు తమను తాము కాపాడుకునేలా ధైర్యంగా వ్యవహరించాలని సూచించారు. అసభ్యకరంగా ప్రవర్తిస్తే ఎటువంటి చట్టాలు అందుబాటులో ఉన్నాయో వివరించారు. అనంతరం విద్యార్థినిలకు స్థానిక ఏరియా ఆస్పత్రి ఆధ్వర్యంలో హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ బి.జయమణి, వైద్యాధికారులు కె.శ్రీనివాసరావు, రాఘవేంద్రరావు, పి.రాజ్యలక్ష్మి, పి.సీతారాం, వైద్య సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

పందిరి సాగు.. బహు బాగు



గురండిలో వేసిన శాశ్వత పందెర సాగు పంటలు

- పాదుల సాగుకు అనుకూలం
- కూరగాయల దిగుబడి ఎక్కువ

భామిని: వ్యవసాయ రంగంలో రైతులకు లాభాలు చేకూర్చే పంటలలో కూరగాయలది ప్రముఖ స్థానమే. వీటినే శాశ్వత పద్ధతిలో సాగు చేస్తే లాభాలు రెండింతలు కావడం ఖాయమని ఉద్యానవన శాఖాధికారులు స్పష్టం చేస్తున్నారు. పంట పొలాల్లో శాశ్వత పందిరి విధానంలో పాదు కూరగాయలు సాగుతో అత్యధిక తరుగుదల లేని నాణ్యత గల పంటలు సాధ్యం. ఈ సుస్థిర వ్యవసాయ పంటలకు భలే గిరాకీ ఉంది. తక్కువ కమతం గల రైతు సైతం శాశ్వత పందిరల పద్ధతిలో కూరగాయలు సాగు సాధ్యపడుతుందని అధికారులు చెబుతున్నారు. పందెర్లపై కాకర, బీర, చిక్కుడు, గోరు చిక్కుడు, బరబటీలు, పొట్ల, ఆనప, గుమ్మడి పండించేందుకు అనువుగా ఉంటుంది. పందెర కింద తక్కువ కాలంలో వచ్చే పంటలను సైతం పండించుకోవచ్చు. ఉల్లి, ముల్లంగి, కేబేజీ, ఎర్రకందమూలం, ఆకుకూరలు వంటి సాగుకు అనువుగా ఉంటుంది. ఎకరా విస్తీర్ణంలో శాశ్వత పందెర కూరగాయల సాగుతో ఏడాదికి రెండు నుంచి మూడు లక్షల రూపాయిల వరకు రైతుకు లాభాలు సాధ్యపడుతుందని ఉద్యాన శాఖాధికారులు చెబుతున్నారు.



ఇనుప తీగలతో అమర్చిన కూరగాయల పందెరలు

ఐటీడీఏ పరిధిలో..

సీతంపేట ఐటీడీఏ పరిధిలో ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో శాశ్వత పందెర పథకం అమలు చేస్తున్నారు. ఎకరం నుంచి పావు ఎకరం వరకు భూమి గల చిన్నకారు రైతులకు కూడా పందెర సాగు సాధ్యపడుతుంది. ఈ పద్ధతిలో సిమెంట్ పోల్స్‌ను భూమి చూట్టూ వేసి పైభాగంలో ఇనుప చువ్వలను పందెరగా వేస్తారు. సాధారణంగా కర్రలతో వేసే పందెర ప్రతీ ఏడాది పాడై కొత్తగా వేసుకోవడంతో ఖర్చు పెరుగుతుంది.

పందెర్లపై ఉన్న పంట పాడవుతుంది. శాశ్వత పందెర విధానంలో జీవిత కాలం పండించుకోవచ్చు. ఒక ఎకరం స్థలంలో సుమారు రూ.2లక్షల వ్యయంతో పందెర వేసుకోవచ్చు. ఇందులో యాభై శాతం అంటే లక్ష రూపాయిలు వరకు ప్రభుత్వం సబ్సిడీ చెల్లిస్తుంది. అర ఎకరంలో లక్ష రూపాయిలతో పందెరలు వేసుకోవచ్చు. ఇందులో రూ.50వేలు సబ్సిడీ చెల్లిస్తుంది. 25 సెంట్ల స్థలంలో రూ.50వేలతో పందెర వేసుకోవచ్చు. రూ.25వేలు సబ్సిడీ పొందవచ్చు.

సొంత భూమి ఉంటే చాలు..



శాశ్వత పందెర పద్ధతిలో కూరగాయల సాగుకు రైతులంతా అర్హులే. సొంతభూమి గల రైతులు పథకం పొందవచ్చు. రైతు ముందుగా ఇనుపు పందెర వేసుకోవాలి. యాభై శాతం సబ్సిడీ ఉద్యానవన శాఖ చెల్లిస్తుంది. ఆసక్తి గల రైతులు తమను సంప్రదించవచ్చు. నేరుగా వచ్చి భూమి చూసి పథకం మంజూరు చేస్తాం.

– పేదాడ జయశ్రీ, ఉద్యానవన శాఖాధికారిణి, ఐటీడీఏ, సీతంపేట

మాదక ద్రవ్యాలపై అవగాహన

సీతంపేట: మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే నష్టాలపై సీతంపేట హైస్కూల్‌లో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్ఐ వై.అమ్మన్నరావు విద్యార్థులకు అవగాహన కల్పించారు. సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మైనర్లు వాహనాలు నడపొద్దని హెచ్చరించారు. డ్రాప్ బాక్స్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో హైస్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ అమ్మన్నరావు

జీడి బీమా గడువు పెంపు

భామిని: జీడి మామిడి పంటకు బీమా చేసుకునేందుకు ఈ నెల 22 వరకు గడువు పెంచినట్లు ఉద్యానవన శాఖ సహాయకుడు ఎర్రన్న మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంటల బీమా చేసుకోని జీడి రైతులు తక్షణమే బీమా చెల్లించి వాతావరణ ప్రభావ నష్టాల నుంచి తగిన పరిహారాలు పొందవచ్చని తెలిపారు. ఆసక్తి గల జీడి రైతులు రైతు సేవా కేంద్రాలలో సంప్రదించాలని సూచించారు.

అపార్ నమోదు శతశాతం పూర్తి చేయాలి : డీఈఓ

వీరఘట్టం: విద్యార్థుల అపార్ నమోదు శతశాతం పూర్తి చేయాలని పార్వతీపురం మన్యం జిల్లా విద్యాశాఖాధికారి టి.తిరుపతినాయుడు సూచించారు. కంబరవలసలో నిర్వహిస్తున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఆయన మంగళవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తరగతి గదిలో విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించాలని, విద్యార్థుల హాజరు పక్కాగా నమోదు చేయాలన్నారు. అజెండా ప్రాప్తికి తరగతులు నిర్వహించాలని సూచించారు. వరల్డ్ టాయిలెట్స్ డే సందర్భంగా ఈ నెల 19 నుంచి వచ్చే నెల 10 వరకు 20 రోజుల పాటు ప్రతీ పాఠశాలలో స్వచ్ఛ పార్వతీపురం మన్యం జిల్లా కార్యక్రమాలను చేపట్టాలన్నారు. ఎఫ్ఏ–1, ఎఫ్ఏ–2 పరీక్షల ఫలితాలను శతశాతం ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. టీపీఆర్ఎల్, లిప్ కార్యక్రమాలను కచ్చితంగా చేపట్టాలన్నారు. 3, 6, 9 తరగతుల విద్యార్థులకు డిసెంబర్ 4న నిర్వహించనున్న నాస్ పరీక్షకు సిద్ధం చేయాలని సూచించారు. కిచెన్ గార్డెన్స్‌పై పర్యవేక్షణ ఉండాలన్నారు. నా పాఠశాల – నాకు గర్వకారణం కార్యక్రమంలో భాగంగా పదో తరగతి విద్యార్థులు శతశాతం ఫలితాలు సాధించేలా కార్యచరణ చేపట్టాలన్నారు. సమావేశంలో ఎంఈఓ ఆర్.ఆనందరావు, కాంప్లెక్స్ చైర్మన్ వై.లక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ తిరుపతినాయుడు

అపార్ నమోదుకు సహకరించాలి

భామిని: పాఠశాలల్లో విద్యార్థులకు అపార్ నమోదుకు అవసరమైన పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రాల మంజూరులో జాప్యం లేకుండా చూడాలని తహసీల్దార్ నీలాపు అప్పారావును టీడీపీ, జనసేన నాయకులు మంగళవారం కోరారు. విద్యార్థుల పేర్లు, పుట్టిన తేదీల్లో మార్పులకు సంబంధించి విద్యార్థులు, తల్లిదండ్రులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని పేర్కొన్నారు. పుట్టిన తేదీల ధ్రువీకరణ పత్రాల మంజూరులో జాప్యం నివారించాలన్నారు. ఆన్‌లైన్‌లో పూర్తి స్థాయి పత్రాలుంటే ఎల్‌బీడీలు మంజూరు సులభతరమవుతుందని తహసీల్దార్ చెప్పారు. తహసీల్దార్‌ను కలిసిన వారిలో టీడీపీ, జనసేన నాయకులు రవినాయుడు, సిర్ల అశోక్, బిడ్డిక ప్రసాద్, భూపతి ప్రభాకర్, కిరణ్ కుమార్ ఉన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

గుమ్మలక్ష్మీపురం: స్థానిక గిరిజన సంఘ కార్యాలయం వద్ద సీపీఎం గుమ్మలక్ష్మీపురం మండల నూతన కమిటీ ఎన్నిక మంగళవారం నిర్వహించారు. ఏకగ్రీవంగా జరిగిన ఈ ఎన్నికలో మండల కార్యదర్శిగా కోలక అవినాష్, కమిటీ సభ్యులుగా మండంగి రమణ, బి.శంకరరావు, ఎం.సన్యాసిరావు, పి.తిరుపతిరావు, బి.అడిత్తో, బి.రమేష్, టి.కృష్ణారావు, పి.అసిరయ్య, ఎం.వెంకటరావు, బి.చామంతి ఎన్నికయ్యారు. గిరిజనుల సాగులో ఉన్న కొండపోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, సీమలగూడ, తాడికొండ గెడ్డలపై మినీ రిజర్వాయర్లు నిర్మించాలని, మూతపడ్డ పాఠశాలలను తెరిపించాలని, అన్నిరకాల అటవీ ఉత్పత్తులను జీసీసీ ద్వారానే కొనుగోలు చేయాలని, రోడ్లు లేని గిరిజన గ్రామాలకు రోడ్లు నిర్మించాలని, జీవో నంబరు 3 పునరుద్ధరించాలని, 1/70 చట్టాన్ని పగడ్బందీగా అమలు చేయాలని, ప్రభుత్వాస్పత్రుల్లో సరిపడ వైద్యులు, సిబ్బందిని నియమించాలని, దుడ్డుఖల్లు పంచాయతీని షెడ్యూల్డు ఏరియాలోకి చేర్చాలన్న డిమాండ్ల సాధన కోసం కమిటీ సభ్యులు తీర్మానాలు చేశారు.



నూతన కమిటీ సభ్యులు వీరే..

సామూహిక సీమంతాలు



సామూహిక సీమంతాలు కార్యక్రమంలో పాల్గొన్న గర్భిణులు

వీరఘట్టం: భగవాన్‌శ్రీసత్యసాయిబాబా జయంతి ఉత్సవాల్లో భాగంగా స్థానిక సత్యసాయి సేవాసమితిలో మంగళవారం మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సాయిభక్తులు గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. పండంటి శిశువులు జన్మించాలని ఆశీర్వదించారు. అనంతరం పసుపు, కుంకుమ, గాజులతో ప్రత్యేక అలంకరణ చేసారు. జాకెట్లు, పండ్లు పంపిణీ చేసారు. సాయి నామ సంకీర్తనలు ఆలపించారు. కార్యక్రమంలో సమితి మహిళా కన్వీనర్ కందుల లక్ష్మి, వడ్డాది సావిత్రమ్మ, కిల్లారి కొండమ్మ, నీలిమ తదితరులు పాల్గొన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ టి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. దివంగత ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు.

రాజకీయ కక్షతోనే పింఛన్ల తొలగింపు!

పింఛన్ల తొలగింపును వ్యతిరేకిస్తూ గరుగుబిల్లి మండలంలోని బీవీపురం గ్రామ బాధిత సామాజిక పింఛన్‌దారులు మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయానికి మంగళవారం వెళ్లి, ఆందోళన చేపట్టారు. రాజకీయ కక్షతోనే తమ పింఛన్లు తొలగించాలని చూస్తున్నారని ఆరోపించారు. అర్హులమైనా తమకు పింఛన్ తీసుకునే అర్హత లేదంటూ ఎంపీడీవో కార్యాలయం నుంచి నోటీసులు వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం తాము వైఎస్సార్ సీపీ సానుభూతిపరులమనే అక్కసుతోనే టీడీపీ నాయకుల సూచనల మేరకు అధికారులు ఇదంతా చేస్తున్నట్లు తాము భావిస్తున్నామన్నారు. ఇది ఎంతమాత్రం తగదని మండిపడ్డారు. తమపై ఎవరు ఫిర్యాదు చేశారో చెప్పాలని, లేకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అంతకు ముందు నోటీసులు అందుకున్న 55 మందిలో 48 మంది ఎంపీడీవో కార్యాలయానికి రాగా వారిలో 46 మంది పింఛన్లు పొందేందుకు అర్హులని అధికారులు గుర్తించారు. దివ్యాంగుల పింఛన్లకు సంబంధించి, వైకల్యం ధ్రువీకరణపత్రం వచ్చిన వెంటనే అర్హులని తేలితే తప్పకుండా పింఛన్లు అందిస్తామని ఎంపీడీవో జి.పైడితల్లి తెలిపారు.



–గరుగుబిల్లి

'సూపర్ సిక్స్' అమలు చేయాల్సిందే..

గుమ్మలక్ష్మీపురం: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాల హామీలను అమలు చేయాల్సిందేనని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కామ్రేడ్ సుబ్బరామమ్మ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని గిరిజన సంఘ కార్యాలయంలో సీపీఎం మూడో మండల మహాసభ మంగళవారం నిర్వహించారు. ఈ సభలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ ఎన్నికలప్పుడు ఆ పథకం ఇస్తాం.. ఈ పథకం ఇస్తాం.. అని ఊదరగొట్టిన చంద్రబాబు గెలిచిన తర్వాత వాటిని అమలు చేయమంటే భయమేస్తోందని అనడం సరికాదన్నారు. హామీలు ఇచ్చినప్పుడు తెలీదా వాటి అమలు కష్టమని ప్రశ్నించారు. ప్రజల సంక్షేమం కోసం ఇచ్చిన హామీలు ఎలాగైనా అమలు చేయాలని పట్టుబట్టారు. ఇప్పటికే నిత్యావసర సరుకులు, విదుయత చార్జీలు పెంచి ప్రజలపై చాలా భారం మోపారని విమర్శించారు. ప్రజా వ్యతిరేక విధానాలను చేట్టడం మానుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. సభలో ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యురాలు ఇందిర, నాయకులు పువ్వల తిరుపతిరావు, బిడ్డిక చామంతి, మండంగి రమణ, కోలక అవినాష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు సుబ్బరామమ్మ

సమస్యల పరిష్కారానికి సహకరించాలి



సింహాచలంకు వినతిపత్రం అందజేస్తున్న 104 ఉద్యోగులు

భామిని: 104 ఉద్యోగుల సమస్యలపై వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, మండల ప్రత్యేకాహ్వానితులు తోట సింహాచలంకు సంబంధిత ఉద్యోగులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. తమ సమస్యలు పరిష్కరించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు. తమకు ప్రతీ నెల జీతాలు అందడం లేదని వాపోయారు. డీఈఓకు జీఓ–7 ద్వారా వేతనాలు చెల్లించాలని, ఉద్యోగులకు ఇన్సురెన్స్‌తో పాటు, యాజమాన్యం నుంచి రావలసిన బకాయిలను, అక్రమంగా వసూలు చేసిన పీఎఫ్ తిరిగి చెల్లించేలా చొరవ తీసుకోవాలని కోరారు.

బహిరంగ మలవిసర్జనను నిర్మూలిద్దాం

- ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవ ర్యాలీలో వక్తల పిలుపు

గుమ్మలక్ష్మీపురం: మరుగుదొడ్లు తప్పనిసరిగా వినియోగించి, ఆరుబయట మల,మూత్ర విసర్జన నిర్మూలనకు పాటుపడాలని ఎంపీపీ కుంబురుక దీనమయ్య పిలుపునిచ్చారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా మండలంలోని ఎల్విన్‌పేటలో మరుగుదొడ్ల వినియోగంపై మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో మలం, మూత్రం విసర్జించడం ద్వారా పరిసరాలు అపరిశుభ్రం కావడం తద్వారా రోగాలు రావడం వంటివి జరుగుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ప్రతిఒక్కరూ మరుగుదొడ్లు నిర్మించుకుని, వాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎల్విన్‌పేట సర్పంచ్ ఆర్.ఎస్.చైతన్యస్రవంతి, ఎంపీడీవో ఎస్.సాల్మన్‌రాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రవీణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి: మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో మరుగుదొడ్ల వినియోగం దాని ప్రయోజనాలపై మంగళవారం అవగాహన ర్యాలీ చేపట్టారు. ఎంపీడీవో జి.పైడితల్లి మాట్లాడుతూ బహిరంగ మలవిసర్జన సామాజిక దురాచారమన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన ద్వారా పర్యావరణం కలుషితం కావడంతో పాటు పరిసరాలు అపరిశుభ్రంగా తయారవుతున్నాయన్నారు. ఆయా పనుల వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లుతోందన్నారు. ప్రతీ ఇంటికి మరుగుదొడ్డి ఉండాలని, ఆ దిశగా ప్రజలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దారు పి.బాల, ఈవోపీఆర్‌డీ ఎల్.గోపాలరావు, సర్పంచ్ కె.ఇందుమతి తదితరులు పాల్గొన్నారు.

జియ్యమ్మవలస: మండల కేంద్రంలో ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ప్రధాన వీధుల్లో ర్యాలీ చేపట్టి, మరుగుదొడ్ల వినియోగం ద్వారా కలిగే ఉపయోగాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



గుమ్మలక్ష్మీపురం: అవగాహన ర్యాలీలో ఎంపీపీ దీనమయ్య, అధికారులు



జియ్యమ్మవలస: అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో రమేష్ తదిదతరులు



సీతంపేట: పెద్దూరులో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

సీతంపేటలో ర్యాలీ

సీతంపేట: వరల్డ్ టాయిలెట్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం పెద్దూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ హెచ్.ఆదిలక్ష్మి, ఉపాధ్యాయులు నెల్లి సత్యంనాయుడు, గ్రామ సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీ చేశారు. మండల పరిషత్ కార్యాలయం ఆధ్వర్యంలో సీతంపేటలో జరిగిన ర్యాలీలో ఎంపీడీఓ కె.గీతాంజలి, ఈఓపీఆర్‌డీ సత్యం, గ్రామ సర్పంచ్ ఎ.కళావతి, కార్యదర్శి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



గరుగుబిల్లిలో ర్యాలీలో ఎంపీడీవో పైడితల్లి, తదితరులు

తోటపల్లి కాలువల డిజైన్‌పై స్పష్టత ఇవ్వాలి

పాలకొండ: తోటపల్లి కాలువల ఆధునికీకరణ పనుల డిజైన్‌పై స్పష్టత ఇవ్వాలని ఏపీ రైతు సంఘం జిల్లా నాయకుడు బుడితి అప్పలనాయుడు డిమాండ్ చేశారు. పట్టణంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాత ఆయకట్టుకు మాత్రమే సాగు నీరు అందించేలా డిజైన్ చేసినట్లు వస్తున్న విషయమై జలవనరుల శాఖ స్పందించి వివరణ ఇవ్వాల్సి ఉందని తెలిపారు. తూముల నిర్మాణం, ఎత్తిపోతల నిర్మాణం చేపడుతున్నారా.. లేదా... అన్న విషయాన్ని తెలియజేయాలని కోరారు. ఈ ప్రాంతంలో ఎప్పుడో పూర్తి కావాల్సిన కాలువల నిర్మాణం ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా ఇంతవరకు పూర్తి కాలేదని ఆరోపించారు. ఇప్పటికైనా కాలువల నిర్మాణం ద్వారా రైతులకు ప్రయోజనం కల్పించాలని కోరారు. ఆయనతో పాటు రైతు సంఘం నాయకులు కిమిడి రామూర్తి, వావిలపల్లి రమణమూర్తి తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

గరుగుబిల్లి: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు మంగళవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు ఎస్.ఎల్.పాత్రుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొని, తమలోని విశేష ప్రతిభ కనబరిచారు. విజేతలకు వారోత్సవాల ముగింపు రోజు అయిన బుధవారం నాడు బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు మధుసూదనరావు తెలిపారు.



పోటీలను పర్యవేక్షిస్తున్న ప్రధానోపాధ్యాయుడు పాత్రుడు

ఖైదీలు అధికారుల సేవలను వినియోగించుకోవాలి..



రిమాండ్ ఖైదీలు అధికారుల సేవలను వినియోగించుకోవాలని ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. పాలకొండ సబ్‌జైలును స్థానిక జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ఎ. విజయరాజుకుమార్‌తో కలసి ఆయన మంగళవారం సందర్శించారు. రిమాండ్ ఖైదీలతో మాట్లాడి వారికి అందుతున్న న్యాయపరమైన సేవలపై ఆరా తీశారు. వారి ఆరోగ్య భద్రతపై దృష్టి సారించాలని జైలు సూపరింటెండెంట్ బి.జోగులను ఆదేశించారు. సీజన్ ప్రాప్తికి అవసరమైన జాగ్రత్తలు, వసతులు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఆయన వెంట హెడ్ వార్డర్ చంద్రరావు, లీగల్ అడ్వైజర్ కుమార్‌స్వామితో పాటు హేమసుందర్, సత్యనారాయణ, నర్సింహులు తదితరులు ఉన్నారు.

– పాలకొండ రూరల్